## సామాన్య కాలం రెండవ ఆదివారం – సంవత్సరం A (18.01.2026)

యెషయా 49:3,5–6; 1 కొరింథీ 1:1–3; యోహాను 1:29–34

“పిలుపును అందుకోవడం / పిలుపును అనుభవించడం”

### పరిచయం:

కొన్ని సంవత్సరాల క్రితం, ఒక యువతి తన చదువులు పూర్తిచేసిన తర్వాత జీవితంలో ఏ దారి ఎంచుకోవాలో తెలియక గందరగోళంలో ఉన్నానని నాతో చెప్పింది. ఎన్నో అవకాశాలు కనిపించాయి, కానీ అన్నీ భారంగానే అనిపించాయి.

ఒక సాయంత్రం ఆమె వాకింగ్ కి వెళ్లింది. అప్పుడు ఒక ఇంటి కిటికీలో వెలుగుతున్న చిన్న కొవ్వొత్తి దీపం ఆమె కంట పడింది. ఆ చిన్న వెలుగు ఆమెకు ధైర్యాన్ని ఇచ్చింది.

అప్పుడే ఆమెకు అర్థమైంది: పిలుపు అనేది మనమే ఏదొక దారినిఎంచుకోవడం మాత్రమే కాదు; ఎవరో మనల్ని ఆహ్వానిస్తున్నారని, మనపై నమ్మకం ఉంచి, ప్రోత్సాహం ఇస్తున్నారని గమనించడమే,

పిలుపు పొందడం లేదా పిలుపును అనుభవించడం—ఇది ప్రతి మనిషి జీవితానికి సంబంధించిన విషయం.

* నేను ఎందుకు ఈ దారిని ఎంచుకున్నాను ?

* నా ప్రతిభ వల్లనేనా?

* లేక నన్ను పిలిచే, సవాలు చేసే, నమ్మకం ఉంచే దేవుని వల్లనా?

నేటి పరిశుద్ధ గ్రంథ పఠనాలు మన పిలుపు (vocation) గురించి, మన సాక్ష్యం (witness) గురించి మాట్లాడుతున్నాయి.

సాక్ష్యం అంటే కేవలం మాటలు సరైనవిగా ఉండటం మాత్రమే కాదు, జీవితం కూడా నిజమైనదిగా ఉండాలి.

అందుకే మనల్ని మనమే ప్రశ్నించుకుందాం:

* యేసు నాకు నిజంగా ఏమౌతాడు?

* నా జీవన విధానం ద్వారా నేను ఇతరులను ఆయన వైపు చూపిస్తున్నానా?

ఈ దివ్యబలిపూజలో ఈ ప్రశ్నలను మన మనసులలో నిలుపుకొనేందుకు; మన మేలు కోసమే మన హృదయాలను యేసుకు తెరిచి, ఆయన ఈరోజు మనకు చెప్పదలచుకున్నది శ్రద్ధగా విందాం!

— కొద్దిసేపు మౌనం —

**ప్రసంగం:**

"ఇదిగో దేవుని గొర్రెపిల్ల; పిలువబడి, పవిత్రీకరింపబడి, పంపబడినవారు"

ధైర్యం నేర్పిన బాల్యం లోని ఓ పాఠం:

కొన్ని సంవత్సరాల క్రితం ఒక మహిళ తన బాల్యస్మృతిని పంచుకుంది. ఆమె తన చిన్న తమ్ముడితో పొలాల్లో ఆడుకుంటుండగా అకస్మాత్తుగా తుఫాను వచ్చింది. తమ్ముడు భయంతో నిలిచి పోయాడు. ఆమె అతని చేయి పట్టుకుని,

"భయపడొద్దు… నేను నిన్ను తీసుకెళ్తాను" అని చెప్పింది.

చిన్నదైనా ఆమె అతన్ని సురక్షితంగా ఇంటికి తీసుకొచ్చింది.

తరువాత ఆమె ఆలోచించింది: ఆ క్షణంలోనే ఆమె దేవుని సంరక్షణను, మార్గదర్శకత్వాన్ని, మరొకరికి తోడుగా ఉండాలనే పిలుపును అనుభవించినట్లు తాను గ్రహించింది.

నేటి వాక్యాలు కూడా ఇదే చెబుతున్నాయి: మనం పిలువబడ్డాము, పవిత్రీకరింప బడ్డాము, పంపబడ్డాము. - యేసు, ప్రపంచపు పాప భారాన్ని మోసినట్లే, ఆయన ప్రేషిత కార్యంలో మనల్ని కూడ భాగస్వాముల్ని చేస్తాడు.

'ఇదిగో దేవుని గొర్రెపిల్ల!'

సువార్తలో బప్తిస్మ యోహాను ఇలా అంటారు :

"ఇదిగో, లోక పాపాన్ని పరిహరించే దేవుని గొర్రెపిల్ల" (యోహాను1:29).

మనకు అలవాటైన మాటలే కానీ, అర్థం ఎంతో లోతైనది.

యోహాను, "ఇదిగో ప్రవక్త" అని చెప్పలేదు.

"ఇదిగో ఉపాధ్యాయుడు" అనలేదు.

అతడు చెప్పింది—"దేవుని గొర్రెపిల్ల." అని మాత్రమే!

గొర్రెపిల్ల – విముక్తి యొక్క చిహ్నం:

ఇది ఏం సూచిస్తుంది?

ఐగుప్తులో ఇశ్రాయేలీయులను గుర్తు చేసుకుందాం. పాస్కాపండుగ నాడు వారు ఒక గొర్రెను బలిచేసి, దాని రక్తం వలన,  మరణ దూతను దాటిపోయారు. అది వారిని బానిసత్వం నుండి విడిపించింది.

ఆ గొర్రె, రక్షణకు చిహ్నంగా మారింది.

యోహాను చూపిస్తున్నది - పాప బానిసత్వం నుండి విముక్తి.

ఆలయంలో ఎన్నో గొర్రెలు బలి చేయబడ్డాయి, కానీ పూర్తిగా సమాధానాన్ని ఇవ్వలేకపోయాయి.

దేవుని కుమారుడైన యేసు మాత్రమే పరిపూర్ణ బలిని అర్పించగలిగాడు.

ప్రతి దివ్యబలి పూజలో మనం ఈ స్వీయ అర్పణను జరుపుకుంటాము.

బాధామయ సేవకుడు:

యెషయా ప్రవక్త ఇలా చెబుతున్నాడు:

“ఆయన గొర్రెపిల్ల వలె వధకు తీసుకుపోబడ్డాడు…” (యెషయా 53:7).

యేసు పడిన బాధ, కేవలం విషాదం కాదు—అది రక్షణ కలిగించే ప్రేమ.

ఒక వృద్ధ భక్తురాలు ఒకసారి నన్ను అడిగింది:

“నేను దివ్య సత్ప్రసాదాన్ని తీసుకునే అర్హత లేనట్టుగా అనిపిస్తే నేను ఏమి చేయాలి?” అని.

అందుకు నేను ఆమెకు చెప్పాను:

“ఇదిగో దేవుని గొర్రెపిల్ల” అని వింటున్న క్షణంలోనే మన పాపాలు ఆయన చేతుల్లో అర్పించ బడుతున్నాయి.

“ప్రభూ, నేను అయోగ్యుడను/ అయోగ్యురాలను” అని చెప్పడం అంటే, మనల్ని మనం ఆయన కరుణ గలిగిన చేతుల్లోకి అప్పగించుకోవడమే.పవిత్రతకు పిలుపు

పునీత పౌలు ఇలా చెబుతున్నాడు:

“పవిత్రులుగా పిలవబడినవారికి” (1 కొరి 1:2–3).

అదే ఆశ్చర్యం! మనం గొప్పవాళ్లమా? కాదు.

క్రీస్తు పవిత్రుడు కనుక మనం పవిత్రులం.

తప్పులు చేసే శిష్యుడిని ఓ గురువు ఓర్పుతో తీర్చిదిద్దినట్లే, దేవుడు
ఒక తల్లిని, తండ్రిని, ఉపాధ్యాయుని, కార్మికుని, పౌరుగువానిని
- ప్రతి ఒక్కరినీ పిలుస్తున్నాడు.

మన స్థానం ఈ లోకంలో ఎవరితోనూ భర్తీ చేయలేనిది.

సాక్ష్యం కోసం పక్కకు తప్పుకోవడం

యోహాను తన పని పూర్తి చేసినప్పుడు యేసును చూపించి పక్కకు తప్పుకున్నాడు.

ఒక సీనియర్ సత్యోపదేశం టీచర్ తన క్లాస్‌ను ఒక చిన్న టీచర్‌కు అప్పగించినప్పుడు ఆమె బాధపడింది. కానీ తరువాత ఆమె, అవుసరమైన ప్రేషిత
కార్యం కొనసాగుతోందని తెలుసుకుని సంతోషించింది.

పక్కకు తప్పుకోవడం అంటే ప్రాముఖ్యత కోల్పోవడం కాదు;పరుల్లో బాధ్యత పెరగడానికి అవకాశం ఇవ్వడం.

కృప మరియు శాంతి – పునాది

పునీత పౌలు గారు చెబుతున్నాడు:

“దేవుని నుండి మీకు కృపయు శాంతియు కలుగుగాక” (1 కొరి1:3).

కృప, శాంతి—ఇవి దేవుని బహుమతులు.

దేవుని గొర్రెపిల్ల అయిన యేసు మనకు ఇదే నేర్పుతున్నాడు:

భారం మోయడం, విమోచనం ఇవ్వడం, ప్రేమతో సాక్ష్యం ఇవ్వడం.

గతం – వర్తమానం – భవిష్యత్తు

పాస్కా గొర్రె, ఆలయ బలులు, యెషయా సేవకుడు—అన్నీ క్రీస్తులో నెరవేరాయి.

మన క్రైస్తవ జీవితం కూడా అలాగే:

క్రిస్మస్ వెలుగునుండి, సిలువ ద్వారా, పునరుత్థానం వరకు, ప్రేషిత కార్యం వరకు.

యేసును కేవలం పుట్టిన శిశువుగా మాత్రమే చూడటం అసంపూర్ణం.

ఆయనే తనను తాను పూర్తిగా అర్పించుకొనే దేవుని గొర్రెపిల్ల.

మన పిలుపులో జీవించడం

ఈ రోజు మనకు సందేశం ఏమిటి?

• నీవు పిలవబడినవాడివి.

• నీవు వెలుగువి.

• నీవు పవిత్రుడివి—నీ అర్హత వల్ల కాదు,

క్రీస్తు వల్ల.

నీ కుటుంబంలో, పనిస్థలంలో, సమాజంలో సాక్షిగా నిలువు.

కృపను, శాంతిని స్వీకరించి, వాటితో జీవించు.

దేవుని ప్రేమను ప్రతిబింబించడం

ఒక యువకుడు తన మిత్రుడికి అనారోగ్య సమయంలో కేవలం తోడుగా ఉంటాడు—
విన్నాడు, ప్రార్థించాడు, సహాయంచేశాడు.

ఆ మిత్రుడు తరువాత అన్నాడు:

“నీ ద్వారా నేను దేవుని ప్రేమను అనుభవించాను.”

అదే మన పిలుపు.

యేసు ప్రపంచపు భారాన్ని మోశాడు— అదే మనము మన రోజు
వారీ జీవితంలో సాక్ష్యం ఇవ్వడానికి విషయం.

ముగింపు:

ప్రేషిత కార్యంలో అర్థించు:

ఇప్పుడు దివ్య సత్ప్రసాదం  వైపు  సాగుతుంటే, మనమూ ప్రకటిద్దాం:

“ఇదిగో, లోక పాపాన్ని తొలగించే దేవుని గొర్రెపిల్ల.”

ఇది మన ధ్యానం కావాలి, మన ధైర్యం కావాలి, మన పిలుపు కావాలి.

మనమిప్పుడు కృపతో, శాంతితో, వెలుగుతో నిండిన వారిగా లోకంలోకి వెళ్లుదాం.

ఆమేన్.